# జీవితరంగం

## – స్వరాజ్య పద్మజ కుందుర్తి



వందేళ్ళ క్రిందట.. ఇద్దరు అమ్మాయిలు, పదేళ్లకే వితంతువులయ్యారు, అమ్మానాన్నలు లేరు, నమ్మినవారు ఆస్తి అంతా దోచేశారు, జీవితాంతం ఎలా గడపాలి? జీవితపోరాటాన్ని కొనసాగిస్తూనే గాంధీగారి పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు, ఎక్కడో బహిరంగసభలో తలిదండ్రులనుంచి తప్పిపోయి ఏడుస్తున్న పసిపాపను అక్కున చేర్చిపెంచుకున్నారు, ఒకవైపు తమదైన జీవనపోరాటం, మరోవైపు దేశంకోసం పోరాటం.. వీళ్ళు చరిత్రపుటల్లో కనిపించకపోవచ్చు, పెద్దల ఉపన్యాసాల్లో వినిపించకపోవచ్చు.. కానీవాళ్ళు ప్రదర్శించిన ఆ పోరాటపటిమ గురించి తెలుసుకుంటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది, నిలువెత్తు స్ఫూర్తిశిఖరాలు కళ్ళముందు కదులుతాయి. వాళ్ళపేర్లు- కనుపర్తి హనుమాయమ్మ,కొండా సత్యవతమ్మలు. అలనాటి వాస్తవ సంఘటనలను వారి మనవరాలు స్వరాజ్య పద్మజకుందుర్తిగారు నెలనెలా కథన రూపంలో మనకందిస్తున్నారు.



కనుపర్తి హనుమాయమ్మగారు



కొండా సత్యవతమ్మగారు

## ముగింపు

"ఒక సామాన్య పౌరురాలు పెద్దమ్మమ్మ రాష్ట్రపతిని కలవడమే ఒక విశేషం ! అలాంటిది రాష్ట్రపతి భవన్లో అతిధిగా ఒకగదిలో ఎలా ఉంది" ఆశ్చర్యంగా అడిగాను అమ్మమ్మను.

"అవును ముందేచెప్పానుగా అక్కయ్య అసాధ్యురాలు. నదురూ బెదురూ లేదు. అప్పడు రాష్ట్రపతిగా వీ వీ గిరిగారు ఉన్నారు. ఆయన మద్రాసులో ఉన్నప్పుడు బామ్మ పొలం కేసుగురించి ప్రకాశం అన్నయ్య దగ్గరికి వెళ్ళినప్పుడు పరిచయం అంతే . ఆయన రాష్ట్రపతి అయ్యారు. ఢిల్లీవరకూ వెళ్ళింది గనుక ఆయనను కూడా కలిసి తన సమస్య వివరించాలని

అనుకుంది. ఆయన ఆఫీసుకు వెళ్ళి అక్కడి వారితో నేను ఆయన చుట్టాన్ని బామ్మ వరస అవుతాను అని చెప్పిందట. వారు బయట ఎవరో వృద్ధురాలు నిలబడి ఉంది. మీకు బామ్మగారు అవుతారట అని ఆయనతో చెప్పగానే ఆయన లోపలికి పిలిచారట. అక్కయ్య ధైర్యం గా లోపలికి వెళ్ళి తనకు వచ్చిన కష్టం చెప్పిందట. "

ఆయన నమస్కరించి బామ్మగారూ ! నేను నా పనులు అయ్యాక సాయంత్రం మీరు చెప్పేది పూర్తిగా వింటాను. పెద్దవారు స్వాతంత్ర్య సమరయోధులుగా ప్రభుత్వం మీకు ఇచ్చిన పొలాన్నికూడా తీసుకోనివ్వని మూర్ఖులు ఉన్నారని అర్థం అవుతోంది. మీకు మంచే జరుగుతుంది. అంతవరకూ మీరు ఇబ్బంది పడవద్దు మీరు ఇక్కడే ఉండండి. మీ సమస్య పరిష్కరించే ఢిల్లీనుంచి పంపిస్తాను అన్నాడట. బంట్రౌతునిచ్చి తన ఇంట్లో దింపమని. ఇంట్లోవారికి కూడా ఫోను చేసి చెప్పాడట. కానీ అక్కయ్య ఎవరింట్లోనూ తినదు. తనకు ఒక గది చూపించమని. అక్కడే కాసిని బియ్యం వండుకుని తిన్నదట."

"సాయత్రం తీరిగ్గా ఆయన "బామ్మగారూ ఇప్పుడు చెప్పండి మీకొచ్చిన కష్టం ఏమిటో" అన్నాడట.

బామ్మ జరిగినదంతా పూర్తిగా వివరించి. అమ్మసంగతీ మా సంగతి చెప్పిందట. ఆ భార్యా భర్తలిరువురూ బాధపడి "బామ్మగారూ కే ఎల్ రావుగారు ఇప్పుడు ఢిల్లిలో లేరు. కొన్ని పనుల నిమిత్తం బెంగాల్ వెళ్ళారు. మూడునాలుగు రోజులలో వచ్చేస్తారు. అప్పటి వరకూ మీరు ఇక్కడే ఉండండి. మీకు ఎలాంటి అభ్యంతరమూ లేకపోతే మా పిల్లలకు మీ అనుభవాలు చెప్పండి వాళ్ళుకూడా మనకు స్వాతంత్ర్యం ఎలా లభించిందో తెలుసుకుంటారు" అన్నాడట. ఆయనకు కూడా పధ్నాలుగు మంది సంతానం. పాతికేళ్ళ పైబడిన వారిదగ్గరినుండీ అన్నివయసులవాళ్ళూ ఉన్నారట. ఆయన తల్లికూడా స్వాతంత్రొద్యమం లో పాల్గొని రాయవెల్లూరు జైల్ లోనే శిక్ష అనుభవించిందట  అలా అక్కడ పదిరోజులకు పైగా వాళ్ళింట్లో కలిసిపోయి ఉండిపోయింది అక్కయ్య."

"అక్కడే ఉన్నా కానీ వాళ్ళ దగ్గర భోజనం చేసేది కాదట.  పదహారు మంది చిన్నా పెద్దా వంటవాళ్ళు ఉండేవారట అక్కడి వంటయింట్లో. ఉత్తర, దక్షిణ భారతదేశపు వంటలతోబాటుగా వివిధ దేశాల వంటలు కూడా చేయగలవాళ్ళట వాళ్ళు. కాశ్మీరునుండి వారానికి రెండుసార్లు కూరలు విమానం లో వచ్చేవట. అక్కయ్య తనకు నచ్చిన వంకాయలో, బంగాళ దుంపలో, పచ్చిమిరప కాయలో తీసుకుని, వంకాయ కుంపట్లో కాల్చి పచ్చడో, బంగాళా దుంప వేపుడో, అదీ కాకపోతే పచ్చిమిర్చి వేయించి కొత్తిమీర పచ్చడో చేసుకునేదట. ఆయన వంటవాళ్ళు టేబుల్ మీద నిండుగా అమర్చిన ఆ కూరలూ పప్పులూ కాదని, మామ్మగారు ఏమిచేసుకున్నారో కనుక్కోమని అక్కయ్య చేసుకున్న పప్పో పచ్చడో మా అమ్మచేసినట్లుగా ఉన్నదని అపురూపం గా తినేవాడట."

"తరువాత కే యల్ రావుగారు వచ్చేక ఆయనను రాష్ట్రపతి భవన్ కే పిలిపించి, అక్కయ్యను చూపించి "మనం ఏదన్నా సాయం చేస్తే ఇలాంటి వాళ్ళకే చేయాలి ఏం చేద్దాం." అని అడిగాడట. " నిజం గా అది చెరువేగనక అయితే మనం ఏమీ చేయలేము. ఒకపని చేద్దాము మనమందరం ఆర్థిక సాయం చేసి ఇంకో పది ఎకరాలు కాకపోతే ఇరవై ఎకరాలు ఎక్కడైనా కొనిద్దాం కొంత కుటుంబం కోసం ఆర్థిక సహాయం ఒక యాభై వేల రూపాయలు కూడా రాష్ట్రపతి ఫండ్ నుంచి ఇద్దాం" అన్నాడట. అక్కయ్యకు ఈ మాట చాలా అవమానం గా అనిపించి కళ్ళనీళ్ళు పెట్టుకుందట. "బాబూ నేను అడుక్కోవడానికి రాలేదు. నాకొచ్చిన కష్టాన్ని మీకు చెప్పుకుంటే తీరుస్తారని వచ్చాను. అది ఊరికి ఉపయోగపడే చెరువులో గనక ఉంటే నేనే అర్జీ పెట్టుకునేదాన్ని కాదు. ఆవూరిలో మేము కోల్పోయిన భూమిలో ఇది ఎంత. నాకు అక్కడే అదే పొలం కావాలి. నేను అడిగేది న్యాయమైన కోరిక. మీరు న్యాయం చేయలేకపోతే ఏంచేస్తాను. నాతిప్పలు నేను పడతాను వెళ్ళొస్తాను" అని అక్కడినుంచి వచ్చెయ్యబోయిందట.

"కేఎల్ రావుగారు దణ్ణం పెట్టేసి మామ్మ గారూ మన్నించండి. మీరు గాంధీజీ మార్గం అనుసరిచే గాంధేయ వాదులనీ, స్వాతంత్ర్య సమరయోధులని తెలిసీ మామూలుగా మట్లాడాను మన్నించండి. మీరు నిశ్చింతగా మీ ఊరు వెళ్ళండి. మీరు ఊరువెళ్ళేలోపు మీపొలం మీదవుతుంది" అన్నాడట. "కానీ బాబూ హైకోర్టులో వాళ్ళు స్టే ఆర్డరూ అని బామ్మ చెబుతుంటే ...న్యాయం ధర్మం ఈదేశంలో సామాన్యులను కాపాడటానికే ఉన్నాయి. ఇబ్బందులపాలు చెయ్యటానికి కాదు. ఆ సంగతి నేను చూస్తాను. మీరు ప్రశాంతం గా ఇవ్వాళ ఇక్కడే ఉండండి. రేపు వెళ్దురుగాని" అన్నారట రాష్ట్రపతి వీ వీ గిరి గారు. మర్నాడు రైలుకి టికెట్ బుక్ చేయించి , కారులో సగౌరవం గా స్టేషన్ కు పంపించాడు. మీ మనవరాళ్ళకి నాతరపున కానుక అని కొన్ని కొత్త గౌన్లూ , రకరకాల చాక్లెట్లూ, బిస్కెట్లూ పంపించాడు.

నాక్కూడా గుర్తుంది ఒక మబ్బురంగు కుచ్చుల శాటిన్ గౌను. ఆకుచ్చుల చివర అందమైన తెల్లని లేస్ తో చాలా బాగుండేది. ఆ గౌన్ చాలా ఇష్టంగా వేసుకునేదాన్ని నేను. సావిత్రి అక్కయ్య, సుప్రభ అక్కయ్య ఇద్దరూ అమ్మలాగే చక్కగా మిషన్ కుట్టేవాళ్ళు. చిన్నప్పుడు వాళ్ళ ప్రయోగాలన్నీ నామీదే. ఎన్నోరకాల గౌన్లు డ్రెస్ లు నాకు తొడిగి ఆనందించేవాళ్ళు. ఆ తరువాత మళ్ళీ నాకే ఆ కళ అబ్బింది.

"ఆ తరువాత ఏం జరిగింది అమ్మమ్మా?" అని కుతూహలంగా అడిగాను.

"ఇంకేముంది అక్కయ్య వచ్చేలోగా ఇక్కడి అధికారులకు ఏమి ఆదేశాలు వచ్చాయో తెలియదు. ఢిల్లీనుంచి మంత్రుల కార్యాలయాల నించి ఫోన్లు వచ్చేసరికి అందరూ వణికి పోయారు. ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే అనుచరులు , పంచాయతీ ఇంజనీరు, తహశిల్ దారూ, కలెక్టరు తో సహా సిబ్బందితో మన ఇల్లు వెతుక్కుంటూ వచ్చారు. అక్కయ్య

వచ్చేలోపు ఆరెండురోజులూ మన ఇల్లు అధికారుల రాకపోకలతో హడావుడిగా అయిపోయింది. అందరూ అక్కయ్య గురించి అడిగి ఆ బామ్మగారు ఎంతపని చేశారండీ ...ఇంత చిన్న విషయానికి ఢిల్లీ దాకా వెళ్ళారు. మేము చేసేవాళ్ళం కదా అన్నారు.కరణం దగ్గరినుంచి అడంగల్ లు తెప్పించి. తాసిల్దారు పొలంలో నిలబడి సర్వేయర్ తో కొలతలు వేయించి ఆ పొలం చెరువు లోది కాదని తేల్చాడు.”

“కరణాన్ని గుంటూరు పిలిపించి నానా చివాట్లు పెట్టి కరిణీకం నుంచి తొలగిస్తాం అన్నారు. కానీ అక్కయ్య ఒప్పుకోలేదు. అందువల్ల వాడి కుటుంబం ఇబ్బందులపాలు అవుతుంది ఆ పాపం నాకెందుకు వద్దు అన్నది. ఆ తరువాత కోర్టునించి కూడా మాకు అనుకూలం గా తీర్పు వచ్చింది. చెప్పింది అమ్మమ్మ.”

నాకు ఇదంతా వింటుంటే చాలా ఆనందం అనిపించింది. “నిజంగా ఆనాటి నాయకుల్లో ఒక సామాన్యుడు కూడా ఇబ్బంది పడరాదు అన్న నిబద్ధత, ఎంతటి ఉన్నత స్థాయిలో ఉన్నా ప్రజల పట్ల ఆదరణ ఉన్నాయి కదా అమ్మమ్మ” అన్నాను. “అవునమ్మా అప్పట్లో ప్రజలగురించి అలా ఆలోచించే నాయకులే ఎక్కువగా ఉండేవారు రాజకీయాలు ఇంకా ఇంత కలుషితం కాలేదు” అన్నది.

“మా కష్టాలు గట్టెక్కాయి కదా అనుకున్నాం కానీ ఇంకా మిగిలే ఉన్నాయి” అంది అమ్మమ్మ. ఈసారి ఆశ్చర్య పోవడం నావంతయింది. “అదేమిటీ ఇంత జరిగాక ఇంకా మిమ్మల్ని ఇబ్బంది పెట్టింది ఎవరు” అన్నాను.”ఎటూ పాలుపోని కరణం చివరకు అక్కడి వారినే మామీదకు ఎగదోసాడు. ప్రాణాపాయం ఉంటుందని బెదరగొడితే ఆడవాళ్ళు ఇంకేం చెయ్యగలరు అనుకున్నాడు. తనపేరు బయటకు రాకుండా చివరి ప్రయత్నం గా వాళ్ళను పొలం బాగుచేయిస్తున్న అక్కయ్య మీదకు ఉసిగొలిపాడు. " “ఇంతజరిగినా అతనికి బుద్ధిరాలేదా అమ్మమ్మ” అన్నాను. “ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ అన్నట్లు ఆడికి ఆ తేలుకొండి బుద్ధి ఎక్కడకు పోతుందీ” అన్నది అమ్మమ్మ. “అప్పుడేం జరిగింది అమ్మమ్మ” అన్నాను ఆత్రుతగా.

“పొలం చూసుకోవడానికి వెళ్ళిన అక్కయ్యను కరణం మాయమాటలు నమ్మి ఒకవర్గం యువకులు అటకాయించి పొలం లోకి అడుగు పెట్టడానికి వీల్లేదనీ మాకు అవకాశం లేకుండా ప్రభుత్వ భూములన్నీ ఇలా మీలాంటి ధనవంతులే ఏదో ఒక వంకతో ఆక్రమించుకుంటున్నారనీ పోట్లాటకు దిగారట. ఒక గంటసేపు ఎటూ కదలకుండా ఘెరావ్ చేసారట.చంపేస్తాము అన్న ఒక్కమాట అనలేదుగానీ గొడ్డళ్ళూ గడ్డపారలూ పట్టుకుని మీదమీదకు వచ్చి , ఇక్కడ నీకేమి జరిగినా అడిగే దిక్కెవరూ అన్నారట. బామ్మ అంతకంటే గట్టిగా చంపుతారా చంపండి చూస్తాను. నేనుమాత్రం మీకు భయపడి పారిపోయే పిరికిదాన్ని కానని అంతకంటే గట్టిగా కేకలు వేసిందట.”

"ఆ ఆపత్సమయంలో మా పొలం పక్కనే తన పొలంలో పనిచేసుకుంటున్న బ్రహ్మయ్య అని ఒక రైతు వాళ్ళ నాన్న కాలం నుంచీ మాగురించి బాగా తెలిసిన వాడు కూడా. అతను జరుగుతున్న గొడవ చూసి మరి కొంతమంది రైతులను తీసుకొచ్చి అక్కయ్యకు రక్షణగా నిలబడ్డాడట. ఈ పొలం నేనే పాలికి చేసి సాగులోకి తెస్తాను ఎవరు అడ్డమొస్తారో చూస్తానని వాళ్ళని బెదరగొట్టి పంపించాడట. అప్పటి నుండీ ఆకుటుంబమే మన పొలాలు కౌలు చేసింది చెప్పింది అమ్మమ్మ. అవును బ్రహ్మయ్య నాకు తెలుసు తెల్లని దట్టమైన తలకట్టూ , తెల్లని మీసాలూ బాగా దృఢంగా నిలువెత్తు మనిషి. కొద్దిగా వృద్ధాప్యపు చాయలున్నా ఆ పలనాటి పౌరుషం బాగా కనిపిస్తుండేది అతనిలో. అతని తరువాత మాపొలాన్ని అతని కొడుకూ ఆటు తరువాత అతని మనుమలూ కౌలు చేసారు. మూడు తరాలు ఆ కుటుంబాన్నే నమ్మాము మేము. చివరికి అతని మనుమలు కూడా కూడా అలాగే మమ్మల్ని అక్కాయ్ అనిపిలుస్తూ కుటుంబ సభ్యుల్లా ఉండేవారు. "

"ఆ సంఘటనతో అక్కయ్యకు చాలా కోపం వచ్చింది. తను ఇలాగే సహనం తో ఉంటే వాళ్ళ ఆగడాలు మితిమీరి పోతాయని భావించింది. వాళ్ళమీద పోలీసు కేసు పెట్టింది కానీ పోలీసులు సర్దిచెప్పి పంపించేశారు. ఎందుకంటే మా పలనాడులో ఇలాంటి దొమ్మీ కేసులు సహజం. పోలీసులు ఇలాగే ఇరువర్గాలనీ శాంతింపజేసి గొడవలు పెద్దవి కాకుండా కాస్త బెదిరించి పంపేస్తుంటారు. ఇంక ఇలా కాదని వాళ్ళని అటువైపు రాకుండా చెయ్యాలనీ అనుకుంది. అప్పటికి సుప్రభ అక్కయ్య చనిపోయి మూడేళ్ళవుతుందని రాధాకృష్ణ మామయ్యకు వేరే పెళ్ళి చేశాము." "అవును జ్యోతి అత్తయ్య ను కదా" అన్నాను మధ్యలో కల్పించుకుంటూ. "అవును జ్యోతి వాళ్ళ నాన్నగారు కొమరవోలు సుబ్బారావుగారు. సైన్యం లో పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయనచేత మారెండు పొలాల మధ్యలో ఉన్న మూడున్నర ఎకరాల పొలం కోసం దరఖాస్తు పెట్టించింది. బామ్మగారి సంగతి తెలుసు గనుక త్వరగానే అది ఆయనకు మంజూరు అయ్యింది. ఇంకేముంది. ఇంక ఆస్థలం లో వాళ్ళు లేకుండా తరిమేసినట్లయ్యింది."

"హమ్మయ్య అలా పొలం మనదయ్యి పంట చేతికి వచ్చిందన్నమాట" అన్నాను.

అమ్మమ్మ నవ్వి "అంత సులువుగా జరిగిపోతే ఇంకేముంది పంట పొట్టమీద ఉండగా నవంబర్లో తుఫాను వచ్చి చెరువు నిండిపోయింది. ఎగువ పొలాలు మునిగిపోతున్నాయన్న వంకతో కచ్చపెంచుకున్న వాళ్ళు చెరువు కట్టకు గండి కొట్టారు. అదీ సరిగ్గా మన పొలం వైపుకు. చెరువు నీరంతా పొలం పైన పడి పంట కొట్టుకు పోయింది. మిగిలినది ఉరకేసి పోయింది. ఆ సంవత్సరం గింజకూడా దక్కలేదు మాకు. అలాంటి ఇబ్బందులు రెండేళ్ళ పాటు పడ్డాం. వాన పడుతూనే చెరువుకు గండి కొట్టడానికి ఒక వర్గం బయలు దేరితే, ఆపటానికి ఒకవర్గం బయలు దేరేది. ఊరిలో గొడవలు అయ్యేవి.

ఒక్కోసారి ఎవరికీ తెలియకుండా అర్ధరాత్రి గండి కొట్టేవాళ్ళు. దానితో మా తో పాటు ఇంకొంతమంది వేరే రైతులు నష్టపోయేవాళ్ళు. ఇదొక పెద్ద తలనొప్పిగా తయారైంది.''

"ఇంక అక్కయ్య లాభం లేదని ఈ సారివాళ్ళెవ్వరూ నోరు మెదపకుండా పొలం పక్కగా బుల్డోజరుతో కాలవ తీయించింది. దానివల్ల రెండు ఉపయోగాలు జరిగాయి. ఒకటి. చెరువులో ఎక్కువైన నీరు కాలవ నుంచి పోతుంది . ఆ కాలవ రావటం వల్ల దిగువరైతులకు నీటియెద్దడి లేకుండా పంటలు పండాయి. వాళ్ళందరూ అక్కయ్య తమకెంతో మేలుచేసిందని చాలా సంతోషించారు. అలా అంత యుద్ధాలు జరిగాక ఆ పంట మాచేతికి వచ్చింది. ఊరిలో మాపట్ల ఆదరణ , గౌరవం పెరిగాయి. కరణం మాత్రం ఎదురైతే పిల్లిలా తలొంచుకుని పోయేవాడు. అక్కయ్యే పిలిచి "ఏం రా ఎలా ఉన్నావ్? మంచంలో పడ్డాడటగా మీ నాయన బాగున్నాడా" అనేది. అప్పుడు తలొంచుకుని బానే ఉన్నాం అత్తయ్యా అనేవాడు. "

"అలా నెమ్మదిగా ఒక్కో ఎకరమూ సాగులోకి తెచ్చుకుంటూ పొలం అంతా సాగులోకి తెచ్చాము. అక్కయ్య కల నెరవేరింది. ఆ భూదేవి చివరకు మాపై కరుణ చూపింది. మా యిబ్బందులన్నీ తొలగి పోయాయని ఆనందించేతలో అక్కయ్య హఠాన్మరణం నన్ను ఎంతో కృంగదీసింది." చెప్పింది అమ్మమ్మ. "అసలు పెద్దమ్మమ్మ ఎలా చనిపోయింది అమ్మమ్మా" అడిగాను. అప్పుడు నేను ఏడవ తరగతి చదువుతున్నాను. ఒక కన్ను వాచిపోయి అయోమయం గా ఉన్న పెద్దమ్మమ్మను తెల్లవారు ఝామున బస్సులో దింపుకున్నాము. ఆ తరువాత ఒకరోజు బానేఉంది. మూడవ నాడు అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయింది. ఆరోజు మంగుళూరుకి నాన్నకు టెలిగ్రాం ఇచ్చాము. ఒకరోజు ఉండి కన్నుమూసింది. అప్పటికి నాన్న వచ్చాడు. ఆదృశ్యం నాకింకా గుర్తుంది. అందరం చాలా ఏడ్చాము. అమ్మమ్మనైతే ఓదార్చటం మా వల్ల కాలేదు.

మా రెండవ అక్కయ్యకు కాలేజీలో లెక్చరర్ గా ఉద్యోగం వేయించే క్రమంలోవిద్య శాఖ మంత్రిని కలిసిందనీ దాని గురించి రెండుమూడుసార్లు హైదరాబాద్ చుట్టూ తిరగాల్సి వచ్చిందని. చివరి సారి వెళ్ళినప్పుడు ఎన్నిసార్లు తిప్పించుకుంటారని మంత్రి రాజారాం గారిని అరిచి అక్కడే కూల పడిందనీ. అక్కడి డాక్టరు చూసి బీ పీ ఎక్కువగా ఉందని ఇంజెక్షన్ చేసి ఆసుపత్రిలో చేరమంటే వినకుండా ఇంటికి వచ్చేసిందనీ చెప్పింది అమ్మమ్మ. పెద్దమ్మమ్మ చనిపోయిన పన్నెండో రోజున అక్కయ్యకు ఉద్యోగం ఆర్డరు వచ్చింది.

అప్పటి నుంచీ నాన్న ఇక్కడే ఉన్నాడు. కానీ ఆయన ఆరోగ్యం సరిలేదు. ఒకరోజు పొలం వెళ్ళినందుకు కాలికి లేచిన బొబ్బ కాలినే బలితీసుకుంది. జైపూర్ కాలు కోసం రెండో కాలికి వేసుకున్న బూటు రెండో కాలికి చేటు అయ్యింది. అల్లుడు తిరిగొచ్చినా అమ్మమ్మకు సంసార భారం తీరిపోలేదు. అమ్మ కూడా ఓర్పుగా పన్నెండు సంవత్సరాల

పాటు సేవలు చేసింది నాన్నకు. ఉమక్కకు పెళ్ళయింది. అన్నయ్య పెద్దవాడు అవుతున్నాడని తన రెక్కలకు సాయం గా ఉంటాడని ఆశించింది అమ్మమ్మ.

ఆవిడ ఆశలు అడియాశలు చేస్తూ వాయు సైన్యం లోకి వెళ్ళిపోయాడు అన్నయ్య. సైన్యం లో చేరినందుకు బాధపడలేదు కానీ, వాడుకూడా బాధ్యత లేకుండా ఉండటం ఆమెను ఎంతో కృంగదీసింది. ఆ సమయం లో మాకోసం వయో భారం మీదపడుతున్నా వంగిన నడుముకు ఆసరాగా కర్ర పట్టుకుని పొలం తిరిగింది అమ్మమ్మ. ఆ తరువాత చెల్లిని తోడుతీసుకొని తిరిగింది. ఆ వోపిక కూడా లేక పూర్తిగా కౌలుకు ఇచ్చేశాం పొలం. ఆ సమయం లో అమ్మా, అమ్మమ్మా ఎంత మానసిక బాధ అనుభవించారో...వారిని దగ్గరగా గమనించిన నాకూ, చెల్లికీ వాళ్ళంటే విపరీతమైన గౌరవం, ఆరాధన.

నేను డిగ్రీ రెండో సంవత్సరం లో ఉండగానే తెలిసిన సంబంధం కావటం. పెద్దమ్మమ్మ తరఫు చుట్టాలు కావటం తో నేను చదువుకోవాలి అన్నా వినకుండా నా వివాహం నిశ్చయించింది అమ్మమ్మ. "అతను ఎవరో కాదు గ్రంథాలయోద్యమం లో పాతూరి నాగభూషణం మొదలైన వాళ్ళతో తిరిగిన రామ కృష్ణయ్య మనవడు.ఆయన కూతురి కొడుకు. నాకు మంచివాళ్ళని తెలుసు. ఈ పెళ్ళి చేసుకో. నాకు అక్కయ్య అప్పచెప్పిన బాధ్యత నిర్వహించనీ అమ్మా అడ్డు చెప్పక" అంది. "నీ ఇష్ట ప్రకారం డిగ్రి పూర్తయ్యాక కాపురానికి వెళుదువులే" అని నన్ను ఒప్పించింది. అన్నయ్యా కు అన్నిసంగతులూ నేను ఉత్తరాలు వ్రాస్తున్నాను. పెళ్ళి శుభలేఖ పంపించాం. కానీ వాడు పెళ్ళికి రాలేదు. అదే ముహూర్తానికి తను నచ్చిన అమ్మాయిని కులాంతర వివాహం చేసుకున్నాడు. అది అమ్మమ్మకు చాలా గట్టి దెబ్బ.

ఆ తర్వాత రెండేళ్ళకి నాన్నా దాటిపోయాడు. అమ్మ, చెల్లీ, అమ్మమ్మ మిగిలారు. నాకు బాబు , పాప పుట్టాక పాప పురిటికోసం నేను అక్కడ ఉండగానే కాలు జారి పడిపోయింది అమ్మమ్మ. అలా దాదాపు ఆరు నెలలు మంచం లో ఉంది. చెల్లెలు రాణి , అమ్మా ఎంతో సేవ చేసారు. ఈ పరిస్థితుల్లో చెల్లిని చూసుకోవడానికి మరిదిగారు వచ్చారు. చెల్లెలు నచ్చి నిశ్చయ తాంబూలాలు తీసుకున్నారు. మమ్మల్ని అందరినీ ఒక దరికి చేర్చాలన్న తపనతో అంపశయ్య మీది భీష్మునిలా మంచం మీద ప్రాణాలు ఉగ్గబట్టుకున్న అమ్మమ్మ చివరి మనవరాలి భర్తను కూడా చూశాను అన్న తృప్తితో ఇంక శలవు తీసుకుంది.

ఇద్దరు పసిపిల్లలతో అమ్మమ్మ మీదపడి ఏడుస్తున్న నన్ను చూస్తూ మామయ్య అన్నాడు కదా. "వాళ్ళూ మీరూ అదృష్టవంతులే అమ్మాయీ. కన్న బిడ్డలు కూడా దూరం పెడుతున్న ఈ రోజుల్లో అమ్మమ్మ కోసం అంతలా ఏడుస్తున్నావ్ " అని ఓదార్చాడు. "మామయ్యా ఇంకెప్పుడూ అలా అనకు ఆవిడే మాకు అమ్మమ్మ. మా అసలు అమ్మమ్మ బ్రతికి ఉన్నా మాకెన్నడూ చూడాలనిపించలేదు" అన్నాను.

అమ్మమ్మ ని చూస్తుంటే నాకు ఏడుపు ఆగట్లేదు.వీళ్ళు సామాన్యులు కారు. ఏ మహర్షిలో శాపవశాత్తు ఈ భూమి పైకి వచ్చి ఉంటారు. ఏ మహా తపస్సులోనో లౌకిక బంధాలవైపు మనస్సు పోయి ఉంటుంది. అందుకు పరిహారం గా భగవంతుడు ఈ లంపటాన్ని తగిలించి ఉంటాడు. మగదిక్కులేని సంసారాన్ని ఈదమని శపించి ఉంటాడు. పెద్దమమ్మ చెప్పినట్లు , ఈ నారద సంసారం ఇద్దరూ కలిసి ఈదారు. ఇద్దరి భాధ్యతలూ తీర్చుకుని కడతేరిపోయారు. ఇందుకోసం వారు పడిన కష్టం సామాన్య మైనది కాదు.

పెద్దమ్మమ్మ పోయినప్పుడు అమ్మమ్మ చెప్పిన మాటలే గుర్తొస్తున్నాయి. ఒకే పక్షి రెక్కల్లాగా ఇద్దరం ఒకే మాటగా బ్రతికాం. మాదికాని ఈ సంసారాన్ని జంటగా మోశాం. మా ఉనికికోసం, స్వాతంత్ర్యం కోసం , ఆ భూమి కోసం , మీకోసం జంటగా పోరాడాము. ఇప్పుడు ఒకరెక్క తెగిపోయిందమ్మా. ఒంటి రెక్కతో ఈ పక్షి ఇంక ఎగరలేదు ఈ భారాన్ని ఎలా మొయ్యాలి అక్కయ్యా అని కన్నీరు మున్నీరుగా విలపించటం చూసాను. ఇప్పుడు ఇంక భవబంధాలన్నీ వదిలి స్వేచ్ఛగా ఒకే పక్షి రెక్కల్లాంటి ఆ అక్కచెల్లెళ్ళ ఆత్మ విహంగమై ఆ పరమాత్ముడిని చేరుకొని ఉంటుంది.

తరువాత చెల్లిపెళ్ళి జరిగింది. దాదాపు ఇంకొక ఇరవైసంవత్సరాలు అమ్మ ఆ పొలం ఫలసాయం తింటూ, మా రాకలూ పోకలూ చూస్తూ , దానితో మాకు బంగారాలు చేయిస్తూ ఉండేది. దగ్గరలో ఉన్న నేనూ, చెల్లీ అమ్మ బాగోగులు చూసేవాళ్ళం. చివరికి ఒకనాడు మా అందరి చేతుల్లో అమ్మ చిలుకు ద్వాదశినాడు మేము చుట్టూచేరి విష్ణు సహస్రనామ పారాయణ చేస్తుండగా , ఉమక్క చెవిలో నారాయణ మంత్రం చెపుతుండగా విష్ణు సాయుజ్యం పొందింది.

వారి నుండి మేము నేర్చుకున్న జీవిత పాఠాలన్నీ మా జీవితం లోని ప్రతి దశలోనూ మాకు అనుసరణీయాలు అయ్యాయి. ఆ ముగురమ్మలూ మాకోసం పడిన కష్టాలు అన్నీ ఇన్నీకావు. అది జన్మ జన్మలకీ తీర్చుకోలేని ఋణం. ఆ మహాతల్లులు ముగ్గురికీ మనసా శిరసా పాదాభివందనాలు చేస్తూ స్వస్తి.

*(సమాప్తం)*

Post your comments